ప్రజాశక్తి

గురువారం 2 ఫిబ్రవరి 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



బాధితులతో మాట్లాడుతున్న రమాదేవి

దళితులపై దాడులకు పాల్పడిన

పెత్తందారులను అరెస్టు చేయాలి

సిపిఎం రాష్ట్రకార్యవర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి -భట్టిప్రోలు

దళితులపై దాడులకు పాల్పడిన పెత్తందారులను తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం రాష్ట్రకార్యవర్గ సభ్యులు డి.రమాదేవి డిమాండ్ చేశారు. కొల్లూరు మండలం చింతల్లాంక, పెదలంక దళితులపై దాడులకు పాల్పడిన పెత్తందారులు యథేశ్చగా తిరుగున్నా పోలీసులు పట్టించుకోపోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. బాధిత కుటుంబాలను బుధవారం ఆమె పరార్శించారు. దాడులకు గల కారణాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ ఆర్‌సి భూములు ప్రభుత్వానివి అని తెలిపారు. వాటి కోసం దళితులు ప్రభుత్వంపై పోరాడుతారని తెలిపారు. అది వారి హక్కు అని తెలిపారు. అయితే దళితలపై పెత్తదారులకు దాడులకు పాల్పడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల సమయంలో దళితులపై కత్తులు, గొడ్డళ్లు, కారం, కర్రలతో దాడికి పాల్పడం ఏమిటని ప్రశ్నించారు. దీని వెనుక రాజకీయ ప్రమేయం ఉన్నట్లుగా కని పిస్తుందన్నారు.తక్షణమే నిందితులపై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. దళితులకు రక్షణ కల్పించి వారికి సాగు కోసం భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం జరిగే వరకూ ప్రజా సంఘాలతో కలిపి పోరాటలు చేస్తామన్నారు.

బడ్జెట్‌లో అంకెలేనా..?

- ఆదాయపన్ను రూ.7లక్షలకు పెంపు
- మధ్య తరగతి వర్గాలకు ఊరట
- వ్యవసాయానికి కేటాయింపులు లేవని పార్టీల విమర్శ
- జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల ఊసే కనిపించని వైనం



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు అంకెల్లో భారీగా కనిపించాయి.వివిధ రంగాలకు ఎన్ని వేల కోట్లు కేటాయించారనే గణాంకాలు చర్చకు దారితీస్తున్నాయి.రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మధ్యతరగతి వర్గాలను ఆకర్షించేలా కొన్ని వరాలు ఇస్తున్నట్లు కనిపించింది.అందరి దృష్టి ఏ అంశంపై ఉంటుందో దానికే ఈసారి తొలిప్రాధాన్యత అంశంగా ముందుకు తెచ్చారు. అదే ఆదాయపన్ను వ్యవహారం. ఆదాయపన్ను గరిష్ట పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.7లక్షలకు పెంచారు. మధ్యతరగతి వర్గాలకు ఇది కొంత ఊరట కలుగుతుంది. మెజారీ ప్రజానీకానికి ఈ స్థాయిలో ఆదాయం ఉందా?అంటే లేదు. రైతులందరూ అప్పులపాలయ్యారు. ఈ స్థాయిలో కూడా ఆదాయం లేదని చెప్పాల్సిన అవసరం లేదు. మరోవైపు కూలీలకు ఈ స్థాయిలో ఆదాయం లేదు. కొద్ది మంది మధ్యతరగతివర్గాలు, ఉద్యోగులకు మాత్రమే ఈ నిర్ణయం ఊరట కలిగిస్తోంది. ఇక ఉద్యోగులకు పెద్దగా ఊరట లేదు. శ్లాబులు పెంచారు. ఉపాధ్యాయులకే ఏడాదికి రూ.10 లక్షలకుపైగా వేతనాలు ఉన్నాయి. ఇపుడు వీరంతా శ్లాబుల ప్రకారం పన్నులు కట్టకతప్పదు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత లేదని రాజకీయ పార్టీలు ధ్వజమెత్తుతున్నాయి. కీలకమైన ఈరంగానికి కేటాయింపులు లేవంటున్నారు. ధరలు లేక రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయాన్ని ఆదుకునే ఎలాంటి చర్యలు బడ్జెట్‌లో కనిపించడం లేదంటున్నారు. ఇక వివిధ పథకాలకు కేటాయింపులు రాష్ట్రాలకు, అక్కడ నుంచి జిల్లాలకు చేరేసరికి ఎన్నిఅందుతాయో చూడాలి. దిగువస్థాయిలో ఏఏ ప్రాజెక్టులకు కేటాయింపులు ఎలా చేశారనేదీ తెలియాల్సి ఉంది. జిల్లాలకు ఏం దక్కుతుందనేదీ పరిశీలించాలి. రైల్వేశాఖ, షిప్పింగ్ హార్బర్లు, కోస్తా ప్రాంతంలో చేపట్టే ప్రాజెక్టులు, ఏకలవ్య పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలు వంటివి జిల్లాకు ఎంతో కొంత వస్తాయి. కనిగిరి, దొనకొండ పరిశ్రమల కేంద్రాలున్నాయి. వీటి ప్రస్తావన రాలేదు. నడికుడి-కాళహస్తిలైన్‌కు నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. విజ యవాడ-చెన్నయ్ మధ్య మూడోలైను పనులు కొన సాగుతున్నాయి. వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు అవసరం ఉంది.దీనికి ఏదో ఒక పద్దు కింద నిధులు విడుదల చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. పొగాకు రైతుల సమస్యలు ప్రస్తావనకు రాలేదు. ఏదేమైనా వివిధ పథకాలకు కేటాయింపుల్లో జిల్లాకు వచ్చేసరికి ఎంత దక్కుతాయనేదీ చూడాల్సి ఉంది.

దారి దోపిడీలు.. ప్రజల బెంబేలు..

- పదిరోజుల వ్యవధిలో రెండు ఘటనలు
- వృద్ధుడిపై ఆగంతకుల దాడి
- హడలిపోతున్న ప్రజలు

హడలుతున్న ప్రజానీకం



మార్కాపురం పట్టణంలో వరుస చోరీలు జరిగాయి. దీంతో ప్రజలు హడలిపోయారు. ఎప్పుడు ఏ ఇంట్లో చోరీ జరుగుతుందోనని ఆందోళన చెందారు. వరుస చోరీలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గాలింపు చేపట్టి గృహాల్లో వరస చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించారు. ఈ ఘటనలు మర్చిపోక ముందే... గుర్తు తెలియని వ్యక్తులు కొందరు (దొంగలు) రూటు మార్చారు. గృహాల్లో చోరీలు కాకుండా... దారి దోపిడీలకు తెర లేపారు. ఫలితంగా మార్కాపురం పట్టణ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఇద్దరు లేక ముగ్గురు కలిసి దాడి దోపిడీలకు పాల్పడుతున్నారు. అర్ధరాత్రి వేళ ఒంటరిగా ఇంటికి చేరుకునే వారిని టార్గెట్ చేస్తున్నారు. మారణాయుధాలు చూపి బెదిరిస్తున్నారు. ఎదిరించిన వారిపై దాడులకు సైతం తెగబడుతున్నారు.

గత పది రోజుల క్రితం ఓ పెద్దాయన రాత్రి 12 గంటల సమయంలో నడుచుకుంటూ వెళుతున్నాడు. కాలేజి రోడ్డులోని రాఘవేంద్ర ఫర్నీచర్ వద్దకు చేరుకోగానే ఇద్దరు వ్యక్తులు హిందీలో మాట్లాడుతూ ఆ పెద్దాయని అటకాయించారు. జేబులో ఎంత ఉంటే అంత నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు ఆ పెద్దాయన ససేమిరా అనడంతో బండరాయితో ఆయన తలపై మోదారు. దీంతో పెద్దాయన తలకు తీవ్ర గాయమైంది. రక్తం విపరీతంగా కారడంతో ఆయన ప్రాణాలకు మీదకు వచ్చింది. కనికరం లేకుండా పెద్దాయన వద్ద గల రూ. 5వేల నగదుతో దోపిడీ దారులు పారిపోయారు. గాయపడిన పెద్దాయన్ను గుంటూరులోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు కుటుంబ సభ్యులు.

ఈ దాడి జరిగి పది రోజులు కాగా... గత ఆదివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో అదే తరహాలో దోపిడీకి దొంగలు యత్నించారు. కాలేజీ రోడ్డులో ఆర్‌టిసి డిపో సమీపంలోని హోటల్ యజమానిపై దోపిడీదారులు ▶ 2లో



తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దళితులు

దళితులపై దాడులు అమానుషం

- ప్రజాసంఘాల నాయకులు
- నిందితులను అరెస్టు చేయాలని

రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి -భట్టిప్రోలు

దళితులపై పెత్తందారుల దాడులు అమానుషమని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కష్ణమోహన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.సురేష్ డిమాండ్ చేశారు. చింతల్లాంక,పెదలంక దళితులపై దాడులకు పాల్పడిన పెత్తందారులను అరెస్టు చేయాలని కోరుతూ కొల్లూరు తహశీల్దారు కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ కోట్లాది రూపాయల ఇసుకను దోసుకునే వారిని వదిలేసి భుక్తి కోసం భూమిని సాగు చేసుకొనే వారిపై పోలీసు, రెవెన్యూ అధికారులు బెదిరింపు ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. దళితులపై దాడులను పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

నిందితులపై చర్యలు తీసుకుంటాం : తహశీల్దారు

ఆర్‌సి భూముల విషయంలో దళితుల పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని తహశీల్దారు శ్రీనివాసరావు, చుండూరు సిఐ కళ్యాణరావు తెలిపారు. ఈ ఘటనపై ఎస్‌సిఎస్‌టి కేసు నమోదు చేసిన దష్వ్యా డిఎస్‌పి స్థాయి అధికారి విచారణ జరిపిస్తామని తెలిపారు. అధికారుల హామీతో ఆందోళన కారులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నాయకులు బి.ఆగస్టీన్, సుబ్బారావు,శరత్, జి.సుధాకర్, వి.వెంకట్రామయ్య,నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి-చీరాల

ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆర్టీసీ ఇన్‌ఛార్జి డిఎం అజితకుమారి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా చీరాల ఆర్టీసీ ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ అజిత కుమారి అధ్యక్షతన రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి చీరాల, ఆపద్బంధు బ్లడ్ బ్యాంక్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డిఎం అజిత కుమారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి, ఆపదలో ఉన్నవారికి రక్తం అందించే కార్యక్రమం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరానికి సహకరించిన రోటరీ క్లబ్ క్షీరపురి చీరాల వారికి, ఆపద్బంధు బ్లడ్ బ్యాంక్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో ఆర్టీసీ ఎంప్లాయిస్, భారతి డిగ్రీ కాలేజ్ విద్యార్థులు పాల్గొని నలభై ఆరు మంది రక్త దానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్టీసీ డిపో ఇన్‌ఛార్జి డీఎం అజిత కుమారి, అసిస్టెంట్ ఇంజనీర్ కళ్యాణి, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి పివి రావు, రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి చీరాల ప్రెసిడెంట్ నన్నపనేని రామకృష్ణ, డాక్టర్ రవితేజ, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ తాడివలస దేవరాజు, రావి వెంకటరమణారావు, ఆపద్బంధు బ్లడ్ బ్యాంక్ ఎండి సంతోష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సందీప్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



దారిదోపిడీలు.. ప్రజల బెంబేలు

(మొదటి పేజీ తరువాయి)

దాడికి యత్నించారు. డబ్బులివ్వాలని బెదిరించారు. ఆ ఘటనలో పాల్గొన్న ఇద్దరు ఆకతాయిల నుంచి హోటల్ యజమాని తప్పించుకున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌కు పరుగున వెళ్లి విషయం చెప్పాడు. పోలీసులు వచ్చే సరికి అక్కడ దొంగలు పారిపోయారు. ఈ విధంగా వరుస దాడులు జరుగుతుండటంతో మార్కాపురం ప్రజలు ఎప్పుడు ఎలాంటి ఘటనలకు గురవుతామోనని ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళ పోలీసులు మరింత గస్తీ పెంచాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

హుండీ ఆదాయం రూ.36.81 లక్షలు

ప్రజాశక్తి-అద్దంకి

సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామివారి దేవస్థానంలో బుధవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. 98 రోజులకు గాను రూ.36,81,763 నగదు, 44.780 మిల్లీ గ్రాముల బంగారం, 304 గ్రాముల వెండి భక్తులు స్వామి వారికి సమర్పించారు. వీటితో పాటు అమెరికా డాలర్లు 6, కెనడా డాలర్లు 30, మలేషియా 51, కువైట్ దినార్, ఉగాండా తదితర దేశాల డాలర్లు స్వామివారికి సమర్పించారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం అద్దంకి దేవదాయ శాఖ పరిశీలకులు పి శైలేంద్ర కుమార్, సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి టి సుభద్ర పర్యవేక్షణలో జరిగింది. ధర్మకర్తల మండలి చైర్మన్ కోట శ్రీనివాస కుమార్, సభ్యులు జమ్మలమడక రమాదేవి, హనుమంతరావు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల పోస్టుల కోసం నోటిఫికేషన్

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు మండలంలో రెండు ఆశా వర్కర్ల పోస్టుల కోసం బాపట్ల జిల్లా డిఎంహెచ్ఓ విజయమ్మ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. మండలంలోని నూజిల్లపల్లి ఒకటి, రేణింగవరం ఒకటి, పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ పోస్టులకు 8వ తరగతి పాస్ అయి ఉండి, 25 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు ఉండాలని, ఈ పోస్టులు మహిళలకు మాత్రమే అని, పెళ్లయిన వారైనా, వితంతువులైనా అర్హులేనని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేవారు పై గ్రామాలలో నివసించే వారై ఉండాలని తెలిపారు. ఈ నెల 4వ తేదీ శనివారం లోపు, పంగులూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అద్దంకి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింగరకొండలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా రూ.1.75 కోట్లతో నిర్మాణ పనులు చేస్తున్న మారుతీ భవనం వసతి గదుల ఆధునీకరణ 65 కోట్లు, డ్రైనేజీ నిర్మాణం రూ.45 లక్షలు, మాడ వీధులు 34 లక్షలు, కార్యాలయ భవనం ఎదురు సిసి రోడ్ నిర్మాణం రూ.15 లక్షలు మొత్తం 1.75 కోట్ల రూపాయలతో చేస్తున్న అభివృద్ధి పనులకు బుధవారం రాష్ట్ర శాప్ నెట్ వర్క్ చైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా హాజరై అభివృద్ధి పనులకు భూమి పూజలు నిర్వహించి శంఖుస్థాపన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కోట శ్రీనివాస్ కుమార్, ఆలయ ఈఓ టి సుభద్ర, ఆలయ వేద పండితులు, ప్రధాన అర్చకులు, సింగరకొండపాలెం సర్పంచ్, ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అభివద్ధి పనులకు భూమి పూజా చేస్తున్న దశ్యం

మినీ లారీ బోల్తా.. 38 మందికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం.. మిరపకోతకు వెళ్లి తిరిగి వెళుతుండగా ప్రమాదం.. బాధితులందరూ కూలీలే




ప్రమాద స్థలం వద్ద గాయాలతో కూలీలు, వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ప్రజాశక్తి-అద్దంకి

మిరప కోతకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో మినీ లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో దాదాపు 38 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బుధవారం పట్టణ సమీపంలోని కలవకూరు రోడ్డులో ఈ ఘటన జరిగింది. మూడు మండలాలకు చెందిన 108 వాహనాల ద్వారా క్షతగాత్రులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వివరాలలోకి వెళ్తే.. మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన కూలీలు ముండ్లమూరు మండలం పూరిమెట్ల గ్రామంలోని రైతులకు సంబంధించిన మిరపకాయల కోతలకు ప్రత్యేక వాహనంలో వెళ్లారు. తిరిగి గ్రామానికి వెళుతున్న క్రమంలో కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీల వద్ద మోటారు సైకిలును తప్పించే ప్రయత్నంలో ఈ వాహనం బోల్తా పడింది. దీంతో మినీ లారీలో ప్రయాణిస్తున్న కూలీలు 38 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. పట్టణ సీఐ రోశయ్య, ఎస్ఐలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల నుంచి ప్రమాద వివరాలను సేకరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ



శింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో రైలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలం పోలినేని చెరువుకు చెందిన నేలపాటి ఆశీర్వాదం(72) అనే వ్యక్తి అర్ధరాత్రి 1.30 గంటలకు హైదరాబాదు నుంచి హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో దిగారు. ఆ ట్రైన్ చెన్నై వైపు వెళ్ళటంతో శింగరాయకొండ రైల్వే స్టేషన్లో రెండో నెంబర్ ప్లాట్‌ఫారం మీద దిగారు. ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారం నుంచి దాటి బయటకు రావాలి. ఈ నేపథ్యంలో రెండో నెంబర్ ప్లాట్‌ఫారం నుంచి ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారం మీదకు ఎక్కుతున్న సమయంలో నెల్లూరు వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న రైలు ఆశీర్వాదాన్ని ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. మతదేహం ముక్కలు ముక్కలుగా ప్లాట్‌ఫారం మీద, రైలు పట్టాల మీద పడిపోయింది. విషయం తెలుసుకున్న ఒంగోలు రైల్వే జిఆర్‌పిఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటన స్థలానికి చేరుకొని ముక్కలు ముక్కలుగా పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించి అతను వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం తెలియజేశారు. బేల్దారు పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అటు ప్లాట్‌ఫారం మీద, ఇటు రైలు పట్టాల మీద మృతదేహం ముక్కలు పడి ఉండడంతో బుధవారం ఉదయాన్నే రైల్వే ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఆయన వద్ద హైదరాబాదు నుంచి శింగరాయకొండ అని రైలు టికెట్ ఉండడంతో రైల్వే ప్రయాణికుడిగా గుర్తించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలు ఢీకొని వ్యక్తి మృతి

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



మృతి చెందిన సుంకరి శ్రీను

త్రిపురాంతకం మండలం లేళ్లపల్లి సమీపంలో కూలీలతో వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న ఖాళీ ఆటోను గుద్దింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మిర్చి కూలీలు చెల్లాచెదురుగా పడిపోయారు. ఆర్తనాదాలు చేశారు. ఈ ప్రమాదంలో వీరభద్రాపురం గ్రామానికి చెందిన సుంకరి శ్రీను(40) అనే కూలీ మృతి చెందగా మరో నలుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. క్షతగాత్రులను వెంటనే యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొని వెళ్ళి చికిత్స అందించారు. ఆటో యర్రగొండపాలెం మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందినదిగా గుర్తించారు. ప్రమాద సమయంలో ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు కూలీలు ఆరోపిస్తున్నారు. సగం మద్యం తాగి మరో సగం మద్యం దాచిపెట్టుకున్నాడని కూలీలు ఆరోపిస్తున్నారు. ప్రమాద సమయంలో ఆటోలో 16 మంది మిర్చి కూలీలు ఉన్నారు. మృతి చెందిన శ్రీనుకు నలుగురు ఆడపిల్లలు, భార్య ఉన్నారు. ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

అంకాలమ్మ తల్లి వార్షికోత్సవం

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

సంతనూతలపాడు గ్రామంలోని అంకాళమ్మ తల్లి ఎనిమిదో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. దాతల సహకారంతో ఈ వేడుకలు మంగళ బుధవారాలలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, గ్రామసర్పంచ్ దర్శి నాగమణి, ఎంపిపి బి విజయ, జడ్పిటిసి దుంపా రమణమ్మ, ఎంపిటిసి బి సుబ్బారావు, ఏఎంసి వైస్ చైర్మన్ జి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-చీరాల



వివరాలు వెల్లడిస్తున్న ఈపురిపాలెం ఎస్ఐ జనార్దన్

మండలంలోని ఈపురిపాలెం ఐటిఐ కళాశాల సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఈపురిపాలెం ఎస్ఐ జనార్దన్ పెట్రోలింగ్ నిర్వహించారు. అయితే ఓ వ్యక్తి అనుమానాస్పదంగా సంచితో తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ తరుణంలో ఆ వ్యక్తి వద్ద ఎనిమిది లీటర్ల నాటు సారా ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వివరాలు సేకరిస్తూ ఉండగా ఆ వ్యక్తి పరారయ్యాడు. ఈ సందర్భంగా ఎస్ఐ జనార్దన్ మాట్లాడుతూ రామాపురానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి నాటు సారా తీసుకు వెళుతున్నట్లు తమ విచారణలో తెలిసిందని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిరుధాన్యాలపై అవగాహన

ప్రజాశక్తి-రేపల్లె



చిరుధాన్యాలపై అవగాహనలో పాల్గొన్న అధికారులు

రేపల్లె మండలంలోని పేటేరు గ్రామంలో అంతర్జాతీయ చిరుధాన్యాలు సంవత్సరం – 2023" కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలు కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్ విజయబాబు మాట్లాడుతూ చిరుధాన్యాలు ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ఐక్యరాజ్య సమితి వారు '2023 సంవత్సరం అంతర్జాతీయ చిరుధాన్యాలు' సంవత్సరంగా ప్రకటించినారు. చిరుధాన్యాలు పంటలైన 9 రకాలు జొన్న, సజ్జ, రాగి, కొర్రలు, సామలు, ఆరికలు, వరిగలు, ఊదలు, ఆండు కొర్రలు మానవాళి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. ఈ చిరుధాన్యాలలో పిండిపదార్థాలు, మాంస కృత్తులు, ఇనుపధాతువు, కాల్షియం అనేక పోషక స్థాయిలు ఉంటాయని తెలిపారు. ఈ చిరుధాన్యాలు శరీరానికి శక్తిని, రక్తపుష్టిని అందిస్తాయని తెలిపారు. మధుమేహం, ఊబకాయం తో బాధపడేవారికి జొన్న మంచి ఆహారమని తెలిపారు. రాగులలో క్యాల్షియం అత్యధిక స్థాయిలో ఉంటుందని, బలానికి, దంతపుష్టికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేటేరు వైసిపి ఇన్‌ఛార్జి నాయకులు రవికిరణ్, ప్రభాకరరావు, పంచాయతీ సెక్రటరీలు పుష్ప కుమారి, దశరథరామయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు వి కొండలు, డి సుష్మా, వి నాగలక్ష్మి, ఏజీవో పావని, ఎంపిడిఓ ప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బివి శ్రీనివాసరావు, జి సురేష్, వినయ్ కుమార్, పి సూరిబాబు, వాలంటీర్లు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

రేపల్లె-ప్రజాశక్తి



లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న దృశ్యం

పట్టణంలోని 3వ వార్డులో 1వ తేదీన నేరుగా ఇంటి వద్దకే వృద్ధాప్య పింఛన్లను కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు చేతులు మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఏ స్థాయిలో అమలు చేస్తోందో ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి పాదయాత్ర సమయంలో చెప్పిన విధంగా తమ పార్టీ అధికారంలోకి రాగానే పింఛన్లను పెంచిందని అన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం పింఛన్‌ను రూ.2,750కి పెంచి నేరుగా ఒకటో తేదీనే ఇంటివద్దనే పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం కంటే మెరుగ్గా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చదలవాడ శ్రీనివాసరావు అన్నారు. అనంతరం నూతనంగా పింఛన్లు తీసుకుంటున్న 12మందికి అర్హులకు పింఛన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో మహిళ మృతదేహం

ప్రజాశక్తి-బల్లికురవ



మృతిచెందిన మహిళ

మండలంలోని కొప్పెరపాలెం సమీపంలోని కాలువలో ఓ మహిళ మృతదేహం బుధవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం మృతురాలిని సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం గ్రామానికి చెందిన సోమిశెట్టి రాజ్యలక్ష్మి(45)గా గుర్తించారు. మృతురాలి భర్త శ్రీనివాసరావు 15 సంవత్సరాల క్రితం మరణించారు. ఆమెకు పిల్లలు లేరు. గత ఐదు నెలల నుంచి ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని స్థానికులు తెలిపినట్లు పోలీసులు చెప్పారు. మృతదేహం పసుమర్రు సబ్ కెనాల్‌లో లభ్యం అయ్యిందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

తెలంగాణలో సంతమాగులూరు వాసులు మృతి


మృతులు తల్లీ కుమారుడు

ప్రజాశక్తి-సంతమాగులూరు



మృతి చెందిన తల్లీ కుమారుడు

తెలంగాణ రాష్ట్రం లోని నల్గొండ జిల్లా, పీఏ పల్లి మండలం, చిలకమర్రి గ్రామ సమీపంలోని రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల వాసులు ఇద్దరు మృతి చెందారు. మృతులు కొప్పరం గ్రామానికి చెందిన తల్లీ కొడుకు అయిన గుంజి వెంకాయమ్మ (35), గుంజి గణేష్ (18)గా గుర్తించారు. అందిన వివరాల ప్రకారం.. మండలంలోని కొప్పరం గ్రామానికి చెందిన గుంజి రామయ్య తన భార్య పిల్లలతో గత కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రంలోని దేవరకొండ గ్రామంలో బేల్దారి పనులు చేస్తూ జీవిస్తున్నారు. బుధవారం ఉదయం గుంజి వెంకాయమ్మ కొప్పరం గ్రామంలో ఉన్న తన అత్తకు ఆరోగ్యం సరిగా లేనందున చూసేందుకు తన కుమారుడు గణేష్‌తో మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. మోటార్ సైకిల్‌పై రహదారిపై వస్తుండగా నల్గొండ జిల్లా, పీఏ పల్లి మండలం, చిలకమర్రి గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో వెంకాయమ్మ, గణేష్‌కు తలలు పగిలి అక్కడికక్కడే మృతి చెందారు. గణేష్ నడుపుతున్న మోటార్ సైకిల్ ఆయిల్ ట్యాంక్ పగిలి రహదారి పైనే దగ్ధమైంది. మృతదేహాలను అక్కడి పోలీసులు దేవరకొండ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను వారి స్వగ్రామం కొప్పరం గ్రామానికి తరలించారు. దీంతో కొప్పరం గ్రామంలోని వడ్డెర కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బాధిత కుటుంబాలకు గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బుధవారం పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలేనికి చెందిన మాజీ మునసబు కాకాని పాపయ్య భార్య కాకాని సీతారావమ్మ మంగళవారం మృతి చెందగా బుధవారం కాకానిపాలెంలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొరిశపాడు మండలం కుర్రవానిపాలెం గ్రామ మాజీ ఉపసర్పంచ్ మోండ్రు నరసింహారావు స్వర్గస్తులు కాగా వారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

నాసిరకంగా కాజ్ వే నిర్మాణం

- వర్క్ ఇన్‌స్పెక్టర్ లేకుండానే పనులు నిర్వహిస్తున్న కూలీలు
- నాసిరకం మెటీరియల్‌తో నిర్మాణం
- ప్రమాణాలు పాటించని వైనం
- ఇసుక బదులుగా మొత్తం దువ్వతోనే..
- కాజ్ వే నిర్మాణ పనులను పరిశీలించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పంగులూరు

మండల కేంద్రమైన పంగులూరు-రేణింగవరం గ్రామాల మధ్య నిర్మిస్తున్న రోడ్డులో, పంగులూరు ఇసుక వాగుపై నిర్మిస్తున్న కాజ్‌వే నిర్మాణం నాసిరకంగా జరుగుతోందని, ప్రమాణాలు పాటించకుండా ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారని సిపిఎం నాయకులు విమర్శించారు. అధికారులు దగ్గర లేకుండా నిర్మాణ పనులు జరుగుతున్నాయని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు పేర్కొన్నారు. పంగులూరు నుంచి రేణింగవరం వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద 7.21 కోట్ల రూపాయల వ్యయంతో సుమారు పది కిలోమీటర్ల రోడ్డును నిర్మిస్తున్నారు. ఇందులో జనకవరం-పంగులూరు మధ్య ఇసుక వాగుపై కాజ్‌వే నిర్మాణం జరుగుతోంది. ఇందులో 25 మీటర్ల పొడవు గల చప్టా నిర్మాణం పూర్తయింది. దానినానుకొని ఇరువైపులా 160 మీటర్ల పొడవు గల గోడను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులను బుధవారం సిపిఎం జిల్లా నాయకులు రాయిని వినోద్‌బాబు, మండల కార్యదర్శి తలపనేని రామారావు పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను అక్కడ వారిని అడిగి తెలుసుకున్నారు. ఇసుకను, కాంక్రీట్ పనులను, దువ్వను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, కాజ్‌వే నిర్మాణ పనులు అత్యంత దయనీయంగా, నాసిరకంగా జరుగుతున్నాయని విమర్శించారు. ఇక్కడ పంగులూరుకు చెందిన ఇసుక వాగు, మరో వాగు, జనకవరం నుంచి ఒక వాగు వచ్చి కలుస్తాయని, వర్షాలు కురిసినప్పుడు ఇక్కడ నీటి ప్రవాహం చాలా ఉధృతంగా ఉంటుందని తెలిపారు. ఇక్కడ ఉండే నీటి ఉధృతిని తట్టుకునే విధంగా ఇక్కడ కాజ్‌వే నిర్మాణం జరగాల్సి ఉండగా అందుకు అనుకూలంగా ఇక్కడ జరగడం లేదని విమర్శించారు. నిర్మాణంలో ఇసుక వాడటం లేదని, కేవలం తక్కువ ధరకు వచ్చే దువ్వతోనే కాంక్రీట్ వేస్తున్నారని అన్నారు. దువ్వతోనే కాంక్రీట్ వేయటం వలన నిర్మాణం పటిష్టంగా ఉండదని, నీటి ఉధృతికి నిర్మాణం కొట్టుకుపోతుందని అన్నారు. ఇసుకను తెచ్చినా దానిని ఉపయోగించకుండా కేవలం దువ్వతోనే నిర్మాణం చేస్తున్నారని విమర్శించారు. కాజ్‌వేను ఆనుకొని నిర్మిస్తున్న గోడకు పునాది రెండు మీటర్ల వెడల్పు ఉండాల్సి ఉండగా ఒక మీటరు వెడల్పు మాత్రమే ఉందని, భూమిలో ఉండే పునాది గట్టిగా లేకపోతే గోడ నిర్మాణం పటిష్టంగా ఉండదని అన్నారు. సిమెంటు తక్కువ వేసి కాంక్రీటు వేస్తున్నారని రామారావు, వినోద్‌బాబు విమర్శించారు. కాంక్రీట్ చేసే మిక్సర్ ట్యాంకులో ఒక్కో ట్యాంకుకు ఎనిమిది బస్తాల సిమెంటు వేయాల్సి ఉండగా, అందులో నాలుగు బస్తాలే వేస్తున్నారని, సిమెంట్ శాతం తక్కువగా ఉంటుందని అన్నారు. ఇంత జరుగుతున్నా ఇక్కడ ఇంజనీరింగ్ సెక్షన్‌కు సంబంధించి ఎవరూ లేరని, దీంతో కాంట్రాక్టర్ కూలీల ద్వారా తన ఇష్టం వచ్చినట్లు పనిచేయిస్తున్నాడని వినోద్‌బాబు, రామారావు విమర్శించారు. అత్యంత ప్రమాణాలతో నిర్మించాల్సిన నిర్మాణాన్ని పేలవంగా, నాసిరకంగా నిర్మిస్తున్నారని అన్నారు. కాంట్రాక్టర్ దగ్గర రాజకీయ నాయకులు లంచాలు తీసుకొని, నిర్మాణాల గురించి పట్టించుకోవటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయని అన్నారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య సొంత గ్రామం కాబట్టి, ఆయన తక్షణమే చర్యలు తీసుకొని కాజ్‌వే నిర్మాణం, రోడ్డు నిర్మాణాలు నాణ్యంగా జరిగేలా చూడాలని వారు కోరారు.



మిక్సర్ మిషన్లోకి దువ్వను ఎత్తుతున్న దృశ్యం



ఇసుకను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు



జిల్లా ఆడిట్ అధికారి నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

నిధుల సద్వినియోగానికి చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులకు సూచించారు. బుధవారం బాపట్ల కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ఆడిట్ అధికారి నూతన కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థలకు మంజూరు చేసిన నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని చెప్పారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆడిట్ శాఖ సంచాలకులు ఆర్ హరి ప్రకాష్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ పద్మజ, ఆడిట్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అంబులెన్స్‌లో జన్మించిన ఆడ శిశువుతో సిబ్బంది, బంధువులు

108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

108 అంబులెన్స్‌లో ప్రసవం జరిగింది. పండంటి ఆడబిడ్డకు ఆ అంబులెన్స్ జన్మస్థలం అయింది. బుధవారం బాపట్ల మండలం వెదుళ్లపల్లి కృపానగర్‌కు చెందిన తుపాకుల మహాలక్ష్మికి పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి ఫోన్ చేశారు. బాపట్ల నుంచి 108 వాహన సిబ్బంది టి సురేష్, పైలెట్ ఎం సుబ్బారావు గర్భిణిని వైద్యశాలకు తరలిస్తున్న సమయంలో మార్గ మధ్యంలో 108 సిబ్బంది పురుడు పోశారు. ఆడపిల్ల జన్మించింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. వారిని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం అందించారు. సకాలంలో పురుడు పోసి తల్లికీ బిడ్డకు ఎటువంటి సమస్య రాకుండా వైద్యం అందించిన 108 సిబ్బందికి గర్భిణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అంబులెన్స్ సిబ్బందిని పలువురు ప్రశంసించారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆంకాలజిస్ట్ కే సాయికృష్ణ

కేన్సర్ వ్యాధి పట నిర్లక్ష్యం వద్దు

ఆంకాలజిస్ట్ సాయికృష్ణ

ప్రజాశక్తి-చీరాల

క్యాన్సర్ వ్యాధిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించవద్దని క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ కొల్లూరు సాయికృష్ణ అన్నారు. చీరాల ప్రభుత్వ వైద్యశాలలో ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన హెచ్‌సిజీఎంఎన్ఆర్ క్యాన్సర్ సెంటర్‌లో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల నాలుగో శుక్రవారం చీరాల ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, పురుషులలో క్యాన్సర్ లక్షణాలపై అవగాహన కల్పించి చికిత్సలు అందచేశారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు వెంటనే తమను సంప్రదిస్తే చికిత్స ద్వారా నయం చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని చీరాల పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సీహెచ్ శరత్ బాబు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో పివిజె రామారావు

సైన్స్ ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించాలి: డిఇఓ

ప్రజాశక్తి-చీరాల

ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న సైన్స్ ఫేర్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిఇఓ పివి జయరామారావు అన్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా సైన్స్ ఫేర్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో సైన్స్ ఫేర్‌ను చీరాల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారని, జిల్లాలోని పాఠశాలల అధ్యాపకులు విద్యార్థులకు సైన్స్ ఫేర్ నమూనాలపై అవగాహన కల్పించి వారికి ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. అనంతరం అధ్యాపకులకు పలు అంశాలపై సూచించారు. కార్యక్రమంలో పర్చూరు డిప్యూటీ డిఈఓ ఏ కిరణ్ కుమార్, ఎంఈఓ డి నాగేశ్వరరావు, డిఎస్ఓ ఎస్‌కె సాదిక్, ఎన్ఆర్ఎంపీ హైస్కూల్ ఏ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో అన్న క్యాంటీన్‌కు 94 రోజులు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో బాపట్ల టిడిపి కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ మంగళవారం 94వ రోజుకు చేరింది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు పేదల ఆకలి తీర్చాలని సంకల్పంతో బాపట్లలో వేగేశన నరేంద్రవర్మ దాతల సహకారంతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. బాపట్ల పట్టణానికి చెందిన పులిపాటి మరియమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో 330 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్న క్యాంటీన్ నిర్వహణకు సహకారం అందిస్తున్న దాతలకు నరేంద్రవర్మ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మరియమ్మ కుటుంబ సభ్యులను ఆయన సన్మానించారు.



భోజనం వడ్డిస్తున్న కార్యకర్తలు

అద్దంకి సిఐగా రోశయ్య

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి పట్టణ సీఐగా ఎం రోశయ్య బాధ్యతలు స్వీకరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐలు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. గతంలో అద్దంకి రూరల్ సీఐగా పనిచేసిన ఆయన ప్రస్తుతం పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలో పనిచేసిన రాజమోహనరావు మరో ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ రోశయ్య మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఇటీవల కాలంలో తీవ్రతరమైందని, ప్రధాన కూడళ్లలో ప్రత్యేక ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.



సిఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎం రోశయ్య

'సెయింట్ ఆన్స్' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు నలుగురు ప్రముఖ ప్రైవేట్ బ్యాంకు కరూర్ వైశ్యా బ్యాంకులో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కరూర్ వైశ్యా బ్యాంకు 1916లో తమిళనాడులోని కరూర్‌లో స్థాపించబడింది. భారత దేశంలోనే ఇది ప్రవేటు రంగ బ్యాంకులలో ప్రముఖమైనది. ఈ బ్యాంకుకు 893 బ్రాంచీలు ఉన్నాయని తెలిపారు. 2023 సంవత్సరంలో యంబిఎ పూర్తి చేసే విద్యార్థులు బ్రాంచ్ సేల్స్ అండ్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల కోసం విజయవాడ సిద్దార్థ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 11మంది హాజరయ్యారు. కాగా రాత పరీక్షలో ఆరుగురు గ్రూప్ డిస్కషన్‌కు ఎంపికయ్యారు. అందులో నలుగురు ఇంటర్వ్యూకు ఎంపిక కాగా ఇంటర్వ్యూల అనంతరం నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మొయిద వేణుగోపాలరావు తెలిపారు. ఎంబిఎ రెండో సంవత్సరం చదువుతున్న డి సుప్రజ జి పూజ, పి దీపిక, వై రమ్య ఎంపికైనట్లు ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ ఆర్ ఇమ్మానుయేల్ తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలలో ఎంపికైన విద్యార్థులకు రూ.3 లక్షల వార్షిక వేతనం, ఇతర అలవెన్సులు లభిస్తాయని కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి నూతలపాటి పూర్ణచంద్రరావు తెలిపారు. కరూర్ వైశ్యా బ్యాంకు వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఎంపికైన విద్యార్థులకు ఎంబిఎ విభాగాధిపతి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.



బ్యాంక్ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్య బృందం

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం

పేదల సంక్షేమమే ధ్యేయం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. మార్కాపురం మున్సిపాలిటీలోని 8వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక వార్డు కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి నాగిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి మార్కాపురానికి ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేశారన్నారు. మార్కాపురం మున్సిపాలిటీలో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 2.40 కోట్ల నిధులను మంజూరు చేయగా పనులు జరుగుతుం న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత, వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషీర్ అలిబేగ్, ఎమ్మెల్యే సోదరుడు కుందురు కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, మొఘల్ సిరాజ్‌తుల్లా బేగ్, దూదేకుల ప్రసాద్, దూదేకుల కరిముల్లా, కొత్త కృష్ణ, టి.రంగలక్ష్మి, దారివేముల బహర్షిత బాబి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, సయ్యద్ ఆబిదా ఖాశిం, పఠాన్ అమీరుల్లాఖాన్, వైసిపి నాయకులు ఉత్తమ్‌కుమార్, గుంటక వెంకటరెడ్డి, రంగయ్య, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, డిఇ షేక్ సుభానీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్ పాల్గొన్నారు. **పెద్దారవీడు :** మండల పరిధిలోని బోయదగుంపుల సచివాలయ పరిధిలోని గడప-గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.20లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనం, రూ.1.84 కోట్లతో నిర్మించిన బాలికల వసతి గహాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పాలిరెడ్డి కష్టారెడ్డి, జడ్‌పిటిసి ఏరువ చలమారెడ్డి, ఎంపిపి బెజవాడ పెద్దగురవయ్య, సర్పంచి బలుసుపాటి లుదియా నాగరాజు, ఎంపిటిసిలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. **పొన్నలూరు :** పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని కోటపాడు, కల్లూరివారిపాలెం, బాలిరెడ్డిపాలెం గ్రామాల్లో గడప గపడకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు, వైసిపి మండల కన్వీనర్ పలనాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచి ఎ.కొండారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్



గడప గడపకూలో ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

సమస్యలు పరిష్కరించాలని ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి -శింగరాయకొండ

తమ గ్రామంలోని సమస్యలు పరిష్కరిచాలని కోరుతూ మండల పరిధిలోని సోమరాజుపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. గ్రామంలోని సమస్యలు పరిష్కరించండయ్యా అంటూ సచివాలయం నుంచి మొదలుపెట్టి మండల పరిషత్ కార్యాలయం వరకూ వినతి పత్రాలు అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాపూరి ప్రభావతి , వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు శీలం రాము, ఎంపిటిసిలు బి.రమణమ్మ, శీలం శ్రీనివాసులు, బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శికి కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లారు. అక్కడ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎంపిడిఒ షేక్ జమీఉల్లాను కలిసి సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో గత రెండు సంవత్సరాల నుంచి వీధిలైట్లు వెలగడం లేదని. తాగునీటి సమస్య గ్రామంలో తీవ్రంగా ఉందని తెలిపారు. రోడ్లు వెంబడి చెట్లు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మురుగు నిల్వ పేరుకు పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఊరంతా జ్వరాలతో అల్లాడిపోతున్నారని వివరించారు. ఈ విషయాన్ని సచివాలయంలో అధికారులు చెప్పిన పట్టించుకోవడం లేదని. సర్పంచి కి చెప్పిన ఉపయోగం లేదని వివరించారు. గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేయాలని ఎంపిడిఒను కోరారు. స్పందించిన ఎంపిడిఒ తక్షణమే సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.



ఎంపిడిఒకు వినతి పత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

కరూర్ వైశ్యా బ్యాంకు బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి- అద్దంకి

కరూర్ వైశ్యా బ్యాంకు బ్రాంచిల విస్తరీకరణలో భాగంగా 794వ శాఖను అద్దంకిలోని బంగ్లారోడ్డులో బుధ వారం ప్రారంభిం చారు. నూతన శాఖ మరియు ఏటిఎంను అద్దంకి మున్సిపల్ కమిషనర్ తెల్లా రవి కుమార్ ప్రారం భించారు. గొట్టిపాటిసూపర్ స్పెషాలటీ హాస్టిటల్ వైద్యులు డాక్టర్ శ్రీలత జ్యోతి ప్రజల్వన చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు డివిజనల్ మేనేజర్ కెవిఎస్. ప్రసాద్ మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలో 50 శాఖలు ఉన్నట్లు తెలిపారు. అద్దంకి శాఖతో వాటి సంఖ్య 51కి చేరినట్లు పేర్కొన్నారు. 31.12.2022 నాటికి విజయవాడ డివిజన్ పరిధిలో రూ.7,292 కోట్ల లావాదేవిలు నిర్వహించినట్లు తెలిపారు. తమ బ్యాంకు 1916లో రూ.లక్ష రూపాయల మూలధనంతో ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.7,596 కోట్ల మూలధనానికి చేరుకున్నట్లు తెలిపారు. రూ.1,26,226 కోట్ల వ్యాపారం నిర్వ హించినట్లు తెలిపారు. రూ.673 కోట్ల నికర ధనాన్ని నమోదు చేసినట్లు తెలిపారు. డివిజనల్ ఆపరేషన్ ఆఫీసర్ ఐవి. సుబ్రమణ్యం మాట్లాడుతూ డిజిటల్ బ్యాంకు సేవలను అద్దంకి మరియు పరిసర ప్రాంత ప్రజలు వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



కెవిబి బ్రాంచి ప్రారంభోత్సవంలో నగర పంచాయతీ కమిషనర్

'విజయశ్రీ'లో రాయితీపై వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

దేవకొండ సుబ్బయ్య మెమో రియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ మరియు విజయశ్రీ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక 60 అడుగుల రోడ్డులోని విజయశ్రీ హాస్పిటల్‌లో బుధవారం 50 శాతం రాయతీపై వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 39 మంది రాయితీ వైద్యపరీక్షలను వినియోగించుకున్నట్లు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. 39 మంది ఒపి విభాగంలో రాయితీ పొందినట్లు తెలిపారు. దీర్ఘకాలిక అన్న వాహిక మరియు జీర్ణాశయం సమస్యలు, అల్సర్ (పుండు) మరియు కేన్సర్ నిర్ధారణ పరీక్ష (గ్యాస్ట్రోస్కోపి)ను 10 మంది వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. నలుగురికి అల్సర్ ఉన్నట్లు నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. ఇద్దరికి కొలనోస్కోపి చేసినట్లు తెలిపారు. 28 మంది రక్తపరీక్షల్లో రాయితీ పొందినట్లు తెలిపారు. ఒపి విభాగంలో రాయితీ 2,850, గ్యాస్ట్రోస్కోపి విభాగంలో రాయితీ రూ.10,000, రక్త పరీక్షల్లో (ల్యాబ్) రాయితీ 12,800 కలిపి మొత్తం రాయితీ 26,850 పొందినట్లు ఆయన తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన తమ వైద్యశాలలో 50 శాతం రాయితీపై వైద్యపరీక్షలు అందిస్తున్నట్లు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.




వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-దర్శి

తాళ్ళూరు మండలం మాధవరం గ్రామానికి చెందిన డీలరు నుసుం చిన్న ఆంజనేయరెడ్డి కుమారుడు వివాహ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో తాళ్ళూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. **పామూరు :** గంగవరపు ప్రభాకర్. పద్మావతి దంపతుల కుమారుడు చిరంజీవి సందీప్, యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి దంపతుల కుమార్తె లిఖిత వివాహ వేడుకలు బుధవారం విజయవాడలోని శేష సాయి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో కనిగిరి ఎఎంసి మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గద్దె గంగయ్య చౌదరి కంబాలదిన్నె మాజీ సర్పంచి గోళ్ళ కేశవులు నాయుడు, గద్దె మోహన్ పాల్గొని నూతన వధూవురులను ఆశీర్వదించారు.



నగదు అందజేస్తున్న పిచ్చయ్య

రూ.20 వేల నగదు అందజేత

ప్రజాశక్తి - గిద్దలూరు

మండల పరిధిలోని పొదిలికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదువుతున్న త్రిపురాపురం గ్రామానికి చెందిన 40 మంది విద్యార్థులు ప్రతి రోజు 5 కిలోమీటర్ల దూరం నుంచి నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లి రావాల్సి వస్తుంది. ఈ విషయం గురించి తెలుసుకున్న యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షుడు,పాఠశాల హిందీ ఉపాధ్యాయులు మొర్రి పిచ్చయ్య విద్యార్థులకు ప్రతి రోజు ఆటో సదుపాయం కల్పించేందుకు ముందుకొచ్చారు. ఆటో నిర్వాహణకు తనవంతు సాయంగా రూ. 20 వేల నగదు బుధవారం అందజేశారు. తోటి ఉపాధ్యాయులు కూడా తమ సహకారం అందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి-వెలిగండ్ల

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్రోబాల్ అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలు జనవరి 28 నుండి 30 వరకూ నంద్యాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని ఉమ్మడిచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ముక్కు ప్రసాద్‌రెడ్డి పాల్గొని ప్రతిభను చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.గురుప్రసాద్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రసాద్‌రెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.గురుప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తోటి విద్యార్థులుయ బుధవారం అభినదించారు. జాతీయ పోటీల్లోనూ ప్రతిభ కనపరిచి పతకం సాధించి జిల్లాకు, మండలానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

రొయ్యల చెరువుల భూములను

ఆక్వాజోన్‌లో చేర్చుకోవాలి

మత్స్యశాఖ ఏడీ ఉషాకిరణ్

ప్రజాశక్తి-టంగుటూరు

రొయ్యల చెరువులు సాగు చేసే రైతులు తమ భూములను ఆక్వాజోన్‌లో చేర్చుకోవాలని ఒంగోలు మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎ. ఉషాకిరణ్ సూచించారు. మండల పరిధిలోని అనంతవరం, వెలగపూడి పంచాయతీలలో ఆక్వా రైతుల సమస్యలపై మత్స్య శాఖ అధికారులు బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ ఉషా కిరణ్, ఎఫ్‌డిఒ వర్షిణి మాట్లాడుతూ పసుకుదురు, తాళ్లపాలెం, తేటుపురం, కేసుపాలెం తదితర గ్రామాల రైతులు తమ భూములను ఆక్వా జోన్ పరిధిలోకి చేర్చుకుంటేనే ప్రభుత్వ ప్రయోజనాలు వర్తిస్తాయని చెప్పారు. గ్రామాలలో రొయ్యల సాగు రైతులు అధికంగానే ఉన్నప్పటికీ ప్రభుత్వ రికార్డులలో మాత్రం రైతుల పేర్లు లేవని తెలిపారు.

అధిక విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

తీర ప్రాంతాలలో నివసిస్తున్న తాము గత 30 ఏళ్లుగా రొయ్యల చెరువుల సాగు పైనే ఆధారపడి జీవిస్తున్నామని పలువురు రైతులు అధికారుల దష్టికి తెచ్చారు. అనంతవరం పంచాయతీ పరిధిలోని దాదాపు 200 మంది రైతులకు కరెంటు మీటర్లు ఉన్నప్పటికీ సబ్సిడీ విద్యుత్ ను పొందలేక పోతున్నామన్నారు. గత ఏడాది వరకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ విద్యుత్ యూనిట్‌కు ఒకటిన్నర రూపాయి లెక్కన చెల్లించినట్లు తెలిపారు.య అయితే ప్రభుత్వం సబ్సిడీ ఎత్తివేయడంతో అప్పటి నుంచి యూనిట్ విద్యుత్ వినియోగానికి రూ.5 రూపాయల అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒక్కో విద్యుత్ సర్వీస్ కు నెలకు రూ.12వేలు కరెంటు బిల్లు వచ్చేదని, ప్రస్తుతం సబ్సిడీ ఎత్తివేయడంతో రూ.38 వేల నుంచి రూ 40 వేలు కరెంట్ బిల్లు వస్తోందని తెలిపారు. ఇది తమకు తలకు మించిన భారంగా పరిణమించిందని రైతులు వాపోయారు. తమ భూములు ఆన్ లైన్‌లో లేకపోవడమే సమస్యగా మారిందని, దీనివల్ల నిరుపేద రైతులకు ప్రయోజనం ఏముందని వారు అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు సమిష్టిగా కషిచేసి భూముల ఆన్‌లైన్ సమస్యను పరిష్కరించి సబ్సిడీ విద్యుత్‌ను తమకు వర్తింపజేయాలని ఆక్వా రైతులు ముక్తకంఠంతో అధికారులకు తేల్చి చెప్పారు. రైతుల సమస్యలను నమోదు చేసుకున్న మత్స్యశాఖ అధికారులు గ్రామ సభలో తీర్మానించిన అంశాలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ మత్స్య సహాయకులు డి. గోవర్ధన్, ఎస్.నాగేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మక్కెన నరేంద్రబాబు, ఎం.భార్గవి, గ్రామ రెవెన్యూ అధికారి తన్నీరు విజయ, ఆక్వా రైతులు ఉప్పలపాటి సుబ్బరాజు, గొడవర్తి రవిరాజు, ఉప్పలపాటి నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మత్స్య శాఖ ఏడి ఉషా కిరణ్

11న లోక్ అదాలత్

ప్రజాశక్తి-మార్కాపురం

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా ఈ నెల 11న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి టి.రాజా వెంకటాద్రి మంగళవారం తెలిపారు. అందులో భాంగా మార్కాపురం కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించు కోవచ్చన్నారు. బాధితులకు తగిన మేర న్యాయం జరుగుతుందన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుంటే సమయంతో పాటు ఆర్థిక భారం తగ్గించుకోవచ్చన్నారు. క్రిమినల్ , సివిల్ , బ్యాంక్ చెక్కు బౌన్స్ , భరణం , ఫ్యామిలీ , మోటారు యాక్సిడెంట్స్ కేసులను రాజీ మార్గంలో ఎలాంటి ఖర్చు లేకుండా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించకున్న సివిల్ కేసుల్లో, మోటారు యాక్సిడెంట్ కేసుల్లో కోర్టుకు చెల్లించిన రుసుం తిరిగి పొందవచ్చునని ఆయన తెలిపారు.

'ఫోక్సో' కేసుపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం ఆలకూరపాడు పంచాయతీ పరిధిలోని పుల్లారెడ్డిపాలెంలో ఇటీవల మతిస్థిమితం లేని బాలికపై అత్యాచారానికి పాల్పడిన లేళ్లపల్లి కళ్యాణ్‌పై పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం విదితమే. అందులో భాగంగా ఒంగోలు దిశా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి పల్లంరాజు బుధవారం టంగుటూరు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫోక్సో చట్టం కేసు గురించి విచారించారు. అనంతరం నిందితుడు కళ్యాణ్ ను ఒంగోలు దిశా పోలీస్ స్టేషన్ కు తరలించారు.

ప్రజలు సహకరించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 11 నుంచి 18 వరకూ శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు ఎలాంటి అసౌకర్యాలు కలుగు కుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర, కర్నూలు, అనంతపురం, కడప మొదలగు ప్రాంతముల నుంచి భక్తులు ఆత్మకూరు, దోర్నాల మీదుగా మరియు విజయవాడ, గుంటూరు మొదలగు ప్రాంతాలనుంచి కుంట, దోర్నాల మీదుగా శ్రీశైలం చేరుకుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో జన రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అందరూ సహకరించాలని కోరారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం వెళ్లే ప్రజలు ఓపెన్ టాప్ ఆటోలు, మినీ లారీలు మరియు ఇతర గూడ్స్ వాహనములలో ప్రయాణం చేయరాదు. అలాంటి వాహనాలను దోర్నాలలో నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-వెలిగండ్ల

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్పర్శ కుష్ఠువ్యాధి నివారణపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్పర్శ కుష్ఠువ్యాధి వ్యాప్తి, దాని వలన కలిగే నష్టాలను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.కొండారెడ్డి, డిపిఎంఒ కె.ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎ.హైమావతి, సర్పంచి ఎం.లక్ష్మీ, ఎస్‌కె.రేష్మ, హెల్‌సూపర్‌వైజర్ మస్తాన్, సిహెచ్‌ఒ జి.లక్ష్మీ తిరుమల, హెల్త్‌సూపర్‌వైజర్ కె.భాస్కర్‌బాబు, పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి నగర పంచాయతీ పరిధిలోని నవాబ్ మిట్టలో తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి శాశ్విత పరిష్కారం చూపించినట్లు వైసిపి నగర పంచాయతీ అధ్యక్షురాలు షేక్ నూర్జహాన్ బేగం తెలిపారు. స్థానిక నవాబ్ మిట్ట ప్రాతంలో సాగర్ పైప్ లైన్ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదిలి నవాబు మిట్టలో ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా తాగునీటి సమస్య తీవ్రతను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే సాగర్ లైను నిర్మాణానికి రూ.10 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ నిధులతో పైపు లైన్ పనులు పూర్తిచేసి ప్రజలకు మంచి నీరు అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వాబుమిట్ట తాగు నీటి సమస్యను ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లడంలో సహకరించిన పొదిలి నగర పంచాయతీ వైసిపి అధ్యక్షురాలు షేక్ నూర్జహాన్ బేగానికి స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఐ రవి కుమార్, శివాలయం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ రమేష్, వైసిపి నాయకులు షేక్ గౌస్, షేక్ ఖాదర్ బాషా, షేక్ ఆఫ్రోజ్ తదితరులుయ పాల్గొన్నారు.



పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నూర్జహాన్ బేగం

టిడిపి కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే ఉగ్ర పరామర్శ

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండల పరిధిలోని తమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన కర్నాటి వెంకట రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న టిడిపి కనిగిరి నియోజక ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, టిడిపి నాయకులు బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని ఆక్షాక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యుడు, తెలుగుయువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్‌రెడ్డి, అవుల మాలకొండారెడ్డి, పల్నాటి బాలకోటిరెడ్డి, పాతకోట వెంకటరెడ్డి, అక్కి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వెంకట రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి

కోటమ్మ చిత్రపటానికి నివాళి

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని చోడవరం గ్రామానికి చెందిన టిడిపి సానుభూతి పరురాలు గోరంట్ల కోటమ్మ దశదిన కర్మ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పాల్గొని కోటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జి.రామయ్యచౌదరి, బత్తుల నారాయణ స్వామి, దామా మురళి, చింతలవెంకటరావు, గోగినేనివారిపాలెం గ్రామ సర్పంచి కొమ్మాలపాటి లక్ష్మీనర్సు, బొద్దులూరి విద్యాసాగర్, రావిపాటి రాఘవ,పోకూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శాదర మృతదేహానికి నివాళి

వైసిపికి చెందిన ముప్పనేని శారద దశ దిన కర్మ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మారెడ్డి అరుణవెంకటాద్రిరెడ్డి పాల్గొని శారద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సురేష్, వెంకటరావు పాల్గొన్నారు.



మిరప తోటను పరిశీస్తున్న ఉద్యాన వన అధికారి శ్వేత

మిరప తోటలు పరిశీలన

గిద్దలూరు : రాచర్ల మండల పరిధిలోని ఆరవీటికోట, ఆకవీడు, చోళ్లవీడు, అనంపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిరప తోటలను గిద్దలూరు ఉద్యానాధికారి డి. శ్వేత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ మిర్చికి నల్లమచ్చలు వచ్చి కుళ్లిపోతున్నట్లు తెలిపారు. మిర్చి నల్ల మచ్చలు నివారించడానికి చర్యల గురించి రైతులకు వివరించారు.

సరైన ప్రణాళికతో ప్రయత్నిస్తే ఫలితం: ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సరైన ప్రణాళికతో ప్రయత్నం చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకోవచ్చునని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎస్ఐ కొలువులకు శిక్షణ పొందుతున్న జిల్లా పోలీసు శాఖకు చెందిన అభ్యర్థులకు ఉచితంగా పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భావపురి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ వారు సోషల్ సర్వీస్ చేస్తున్నారని, నిరుద్యోగులకు ఉచితంగా పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారని, పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ ఎస్ఐ కొలువులను సాధించడానికి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి కూడా ఉచితంగా శిక్షణ ఇవ్వాలని కోరగా అందుకు వారు అంగీకరించి పోలీస్ శాఖకు చెందిన 26 మంది అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవితంలో ఏదీ సులువుగా రాదని, మనం ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే ప్రత్యేక శిక్షణ, ప్రణాళిక అవసరమని అన్నారు. సరైన ప్రణాళికతో ప్రయత్నం చేస్తే జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రస్తుతం పోలీస్ కొలువులకు పోటీ ఎక్కువగా ఉన్నదని, ఆ పోటీలో విజయం సాధించాలంటే సరైన శిక్షణ ఉండాలన్నారు. జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ ఎస్ఐ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు శిక్షణ తరగతులకు వెళ్లి రావడానికి శాఖా పరంగా కొంత వెసులుబాటు కల్పిస్తున్నామని తెలిపారు. దానిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకొని ఎస్ఐ ఉద్యోగాలను సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భావపురి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు, డి చిన్న భూషణం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎస్పి వకుల్ జిందాల్

గౌరాబత్తుని రామారావు కన్నుమూత

ప్రజాశక్తి-వేటపాలెం



తెలుగుదేశం పార్టీ మండల మాజీ అధ్యక్షులు, రామన్నపేట పంచాయతీ 10వ వార్డు సభ్యులు గౌరాబత్తుని రామారావు(78) మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. రామారావుకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు రవి బాబు బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. వయోభారంతో మృతి చెందిన రామారావు పేరు రావూరిపేటలో తెలియని వారు లేరు. టిడిపి ఆవిర్భావం నుంచి నేటి వరకు ఆయన ఆ పార్టీలోనే ఉన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. స్థానికంగా ఉన్న దంతంవారి కళ్యాణ మండపానికి ఉప కోశాధికారిగా ఉన్నారు. గ్రామపెద్దల్లో ఒకరిగా ఎవరికి ఏ సమస్య తలెత్తినా పరిష్కరించడంలో రామారావు ముందుండేవారు. రామారావు పార్థివ దేహాన్ని ఎమ్మెల్సీ పోతుల సునీత, రామన్నపేట సర్పంచ్ రమణ, కార్యదర్శి బాలిగ సురేంద్ర, తోటి వార్డు సభ్యులు, కళ్యాణ మండపం సభ్యులు సందర్శించి నివాళులు అర్పించారు.

పొలంబడి కార్యక్రమం

ప్రజాశక్తి-వేటపాలెం

రైతు భరోసా కేంద్రం పరిధిలోని అక్కాయపాలెం గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఐ కాశీవిశ్వనాథం మాట్లాడుతూ రైతులకు సాగు ఖర్చును తగ్గించుకొని అధిక దిగుబడి పెంచుకునే దిశగా సూచనలు సలహాలు ఇచ్చారు. ఏ పురుగులకు ఏ మందు వాడాలో, ఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అలాగే రైతులకు పంట సాగులో సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, ఏఇఒ గోపికృష్ణ, పంచాయతీ సెక్రెటరీ పూర్ణకుమారి, స్వాతి, రామారావు, శివనాగ బాబు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పొలం బడి నిర్వహిస్తున్న దృశ్యం

నరసింహకు నివాళి

ప్రజాశక్తి-మేదరమెట్ల

మండలంలోని కుర్రవానిపాలెం గ్రామంలో వైస్ సర్పంచిగా పనిచేసిన మోండ్రు నరసింహారావు(82) బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన దీర్ఘకాలంగా సిపిఎం పార్టీలో ఉండి అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. తమ కోడలైన మోండ్రు పల్లవి రాణిని గ్రామ సర్పంచిగా చేశారు. ఆయనకు ఎంతో రాజకీయ చరిత్ర ఉంది. ఆయన మృతదేహాన్ని సిపిఎం మండల కమిటీ నాయకులు ఎం ఆంజనేయులు, ఎం చిన్న సుబ్బారావు, పెద్ద సుబ్బారావు, రవి సందర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వీరితో పాటు స్థానిక శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్యలు ఆయన మృతదేహాన్ని సందర్శించి ఆ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, వైసిపి నాయకులు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాసరావు కువైట్‌లో ఉన్నందువల్ల గురువారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలియజేశారు.


శ్మశాన వాటిక వద్ద కల్పించిన సౌకర్యాలు దృశ్యం

శ్మశానవాటికలో రోడ్డు, వీధి దీపాలు ఏర్పాటు


ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు అంబేద్కర్ నగర్ శ్మశానవాటిక వద్ద గ్రామానికి చెందిన తానికొండ వీరయ్య కుమారుడు గంగాధర్ జ్ఞాపకార్థం విజయభారతి రూ.2 లక్షలతో గ్రావెల్ రోడ్డు, వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ చేతుల మీదుగా గురువారం రాత్రి 6 గంటలకు ప్రారంభించనున్నారు. శ్మశానం వద్ద వీధిదీపాలు, రోడ్డు నిర్మించేందుకు సహకరించిన దాతకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

'షూటింగ్ బాల్' అధ్యక్షుడిగా డాక్టర్ బాబూరావు

ప్రజాశక్తి-చీరాల

అంబేద్కర్ ఐడియాలజీ ఫోరం మరియు రోటరీ క్లబ్ అధ్యక్షులుగా డాక్టర్ ఐ బాబూరావు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, ఆయన సేవలను గుర్తించి బాపట్ల జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆయనను నియమిస్తున్నట్లు బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్ర తెలిపారు. డాక్టర్ బాబూరావును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ఇప్పటికే ప్రజాసేవలో తనదైన శైలిలో ముందుకు వెళ్తున్న డాక్టర్ బాబూరావు తమ సహకారంతో షూటింగ్ బాల్ అసోసియేషన్‌ను ముందుకు నడిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఈటి రత్నకుమార్ పాల్గొన్నారు.


డాక్టర్ బాబూరావును సన్మానిస్తున్న దృశ్యం


విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు సాల్మన్

తైక్వాండోలో పేరాల హైస్కూల్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-చీరాల

ఇటీవల రేపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఆంధ్ర రత్న మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఇనగంటి రాహుల్ బంగారు పతకం సాధించిన నేపథ్యంలో పాఠశాలలో శుక్రవారం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్ రాజు మాట్లాడుతూ క్రీడలతో పాటు చదువులో కూడా చక్కగా రాణించాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ రమణారావు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, గాంధీ, పవని భానుచంద్ర మూర్తి పాల్గొన్నారు.


ధ్వజ స్తంభ ప్రతిష్టలో పాల్గొన్న మహిళలు

ఘనంగా ధ్వజస్తంభ పున ప్రతిష్ట

ప్రజాశక్తి-రేపల్లె

మండలంలోని కారుమూరు గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి దేవాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం మూడు రోజుల క్రితం ఘనంగా మొదలైంది. బుధవారం ఉదయం 9:27 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజస్తంభ పున ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. వేద మంత్రాల నడుమ ప్రతిష్ఠాపనా కార్యక్రమాలను ఆలయ ఉత్సవ కమిటీ దిగ్విజయంగా నిర్వహించింది. దీనికి ముందు ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు, ఆలయ ప్రధాన అర్చకులు చలమచర్ల వెంకటాచార్యులు, వర్ధ్యం రామకృష్ణ, వర్ధ్యం వేణుగోపాల్, నల్లూరి ఆదిత్య భగవాన్‌తో పాటు 21 మంది వేద పండితులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ప్రతిష్ఠ మహోత్సవం 30వ తేదీ నుంచి 1వ తేదీ వరకు ముత్తేవి శ్రీనివాస్, శశికాంత్ ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. 3 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లులో అభివృద్ధి పనులకు వైసిపి పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ బుధవారం శ్రీకారం చుట్టారు. సినిమాహాలు రోడ్డులోని అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూ.24 కోట్లతో ఇంకొల్లు నుంచి పర్చూరు వరకు 19 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టను న్నారు. ఇంకొల్లు సినిమాహాలు సెంటర్ బొమ్మల సెంటర్ నుంచి పర్చూరు రోడ్డులోని వై జంక్షన్ వరకు 10 మీటర్ల మేర సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. అనంతరం ఇంకొల్లు నుంచి పర్చూరు వరకు 19 కిలోమీటర్ల మేర 7 మీటర్ల తారు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ నాణ్యతతో పాటు వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని సూచించారు. సినిమాహాలు సెంటర్‌లో పశు సంచార వైద్య సేవ వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆమంచి మాట్లాడుతూ మండలంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డ్రైనేజీ, ఆక్రమణలు, రోడ్లు, తాగునీరు, ఆటోనగర్, ఇళ్ల స్థలాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బండారు అనూష రాజ్‌కుమార్, సర్పంచ్ ఏజర్ల ప్రసన్న సైమన్, వైసిపి మండల కన్వీనర్ బండారు ప్రభాకర్‌రావు, వైస్ ఎంపిపి తూమాటి చలమయ్య, కో ఆప్షన్ సభ్యులు షేక్ సుబాని, ఉప సర్పంచ్ సయ్యద్ లతీఫ్, ఆర్అండ్‌బి ఇఇ వి శ్రీనివాసరావు, డిఇ ఎం నరసింహులు, ఏఇఇ జి నాగార్జున, కాంట్రాక్టర్ ఎం రాఘవరావు, ధనుంజయరాజు, బండ్ల వెంకటసుబ్బారావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.


పశు సంచార వైద్య సేవ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆమంచి కృష్ణమోహన్

ఎన్నికను పకడ్బందీగా జరపండి: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఈనెల 3వ తేదీ శుక్రవారం నాడు మండల పరిషత్ అధ్యక్ష పదవికి జరిగే ఎన్నికను పకడ్బందీగా జరపాలని చీరాల ఆర్డిఓ సరోజిని అధికారులకు సూచించారు. బుధవారం సంతమాగులూరులోని అధ్యక్ష ఎన్నిక జరిగే మండల పరిషత్ సమావేశం హాలును ఆమె పరిశీలించారు. ఈ ఎన్నిక ఏర్పాట్లను ఎంపిడిఓ ఎం సాంబశివరావును అడిగి తెలుసుకున్నారు. అధ్యక్ష ఎన్నిక సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పూర్తిగా బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్ఐ నాగశివారెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రాజేష్, డిప్యూటీ సీఈఓ హనుమంతరావు, తహశీల్దారు అశోక్‌వర్ధన్, విస్తరణాధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


సంతమాగులూరులో అధ్యక్ష ఎన్నిక జరిగే హాలును పరిశీలిస్తున్న ఆర్డీవో సరోజిని

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి : బూచేపల్లి

ప్రజాశక్తి- జరుగు మల్లి

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి బెల్లం నిర్మల అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జరుగుమల్లి మండల అభివృద్ధి కోసం రూ. 1.13.కోట్ల విలువైన 20 పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలాభివృద్ధికి కావాల్సిన నిధులను జిల్లా పరిషత్ నుంచి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బెల్లం సత్యన్నారాయణ, జడ్‌పిటిసి మాతంగి చంద్రలీల, వైస్ ఎంపిపిలు పులి బిక్షాలు, చుండి శ్రీ లత, ఎంపిడిఒ పి.రామకృష్ణ, పిఆం ఎఇ కోటా శ్రీహరి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ కె.శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ జి.రేష్మి, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి-దర్శి

జూనియర్ నేషనల్ టైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో దర్శికి చెందిన మాడపాకుల శైలజ జాతీయస్థాయి ప్రతిభ చూపి బంగారుపతకం సాధించింది. గత నెల 27,28,29 తేదీల్లో బెంగుళూరులోని కోరుబంగ్లా ఇండోర్ స్టేడియంలో టైక్వాండో (ఫైటింగ్) పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శైలజ పాల్గొని ప్రతిభ చూపి బంగారు పతకం సాధించింది. శైలజ ప్రస్తుతం తెనాలిలోని వైష్ణవి జూనియర్ కాలేజిలో సీనియర్ ఇంటర్ చదువుతోంది. శైలజ జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించడంతో పాటు అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. 2019లో మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన అండర్-17 ఛాంపియన్ షిప్‌లో పోటీల్లోనూ బంగారుపతకం సాధించింది. ఈ సందర్భంగా శైలజను పలువురు అభినందించారు.



బంగారు పతకం సాధించిన శైలజ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

5న సంఘీభావ సభ

కరపత్రం ఆవిష్కరించిన వివిధ సంఘాల నేతలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల సంఘీభావ సభ ఒంగోలు అంబేద్కర్ భవనంలో ఈనెల 5న నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన కరపత్రాన్ని స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్, సిఐటియు, జెవివి పెన్షనర్స్ నాయకులు మాట్లాడుతూ 2023 మార్చిలో జరగబోయే ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు(తూర్పు రాయలసీమ) నియోజకవర్గ పట్టభద్రుల అభ్యర్థిగా మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థిగా పొక్కిరెడ్డి బాబు రెడ్డి ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్(పిడిఎఫ్) అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారన్నారు. వారికి మద్ధతుగా ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మిక, యువజన విద్యార్థి, పౌర సంఘాలు, మేధావులు, పట్టభద్రుల 70 సంఘాలకు పైగా మద్దతు తెలిపాయన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల సంఘీభావ సభ ఈనెల 5న ఒంగోలు అంబేద్కర్ భవనంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందన్నారు. ఈ సభకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రమణ్యం, యండపల్లి శ్రీనివాసులు రెడ్డి, కెఎస్.లక్ష్మణరావు, అభ్యర్థులు, మద్దతు సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారన్నారు. ఈ సభలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కరపత్ర ఆవిష్కరణలో యుటిఎఫ్, సిఐటియు, జెవివి, పెన్షన్ నాయకులు కె.శ్రీనివాసరావు, డి.వీరాంజనేయులు, ఎన్.చిన్న స్వామి, వై.వెంకట్రావు, కాలం సుబ్బారావు, సిహెచ్ జయప్రకాష్, జి.శేషయ్య, సురేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

- నిరాశాజనకంగా ఉందన్న సిపిఎం, వైసిపి
- ప్రత్యేక హోదా, విభజన హామీలు విస్మరణ
- రాష్ట్ర, జిల్లా ప్రజలను నిరాశపరచిన బడ్జెట్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 సంవత్సరానికి 45 లక్షల కోట్లతో లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పట్ల మిశ్రమ స్పందన కనిపిస్తోంది. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.10 లక్షల కోట్లు, రాష్ట్రాల ఆర్థికాభివద్ధికి వడ్డీ రహిత రుణాలకు రూ.13.7 లక్షల కోట్లు కేటాయించారు. 7 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు, ఉజ్వల పథకంలో రూ. 9.6 కోట్ల ఎల్‌పిజి కనెక్షన్లు ఇవీ బడ్జెట్ ముఖ్యాంశాలు మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపేలా బడ్జెట్ ఉందని, ప్రత్యేక హోదా, విభజన హామీల ఊసే లేదని సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రటసీ నేతలు పేర్కొన్నారు. రాష్ట్రానిని ఆశాజనకంగా బడ్జెట్ లేదని వైసిపి ఒంగోలు ఎంపీ ఆవేదన

నిరాశాజనక బడ్జెట్

- సయ్యద్ హనీఫ్, సిపిఎం జిల్లా కార్యదర్శి



కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్య తరగతి ప్రజలను తీవ్రంగా నిరాశ పరిచింది. మధ్య తరగతి, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలను ఊరించి ఉసూరు మనిపించింది. బ్రాండెడ్ దుస్తులు, సిగరెట్లు, టైర్లు, బంగారం, వెండి ధరలు పెంచి మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల ఊసే లేదు. విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, పోలవరం నిధుల ఊసే లేదు. నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైన్, కనిగిరి నిమ్జ్, దొనకొండ పారిశ్రామిక కారిడార్‌ను పట్టించు కోలేదు. వెనుకబడిన జిల్లాల జాబితాలో జిల్లాను చేర్చలేదు.

ఆంధ్రకు ఆశాజనకంగా లేని బడ్జెట్

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి



2023-24 సంవత్సరానికి రూ.45 లక్షల కోట్లతో లోక్ సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ రాష్ట్రానికి ఆశాజనకంగా లేదు. పేదల అభ్యున్నతికి, వస్తు ఉత్పత్తికి పెద్ద పీట వేసినా ఆంధ్రపదేశ్ రాష్ట్రానికి సంబంధించి ప్రాజెక్టులు ఏర్పాటులో నిధుల కేటాయింపులోను నిరాశపరిచారు. రాష్ట్రానికి సంబంధించి ఈ సారి కొత్త రైల్వే లైన్లు, ప్రత్యేక హోదా ప్రకటన, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు, విభజనతో ఏర్పడిన లోటులో నిధుల కేటాయింపుపై బడ్జెట్ లో ఏమీ చెప్పక పోవడం బాధాకరం.

రైతు, పేదల వ్యతిరేక బడ్జెట్

గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు, పేదల వ్యతిరేక బడ్జెట్ అని రైతు సంఘం అధ్యక్షుడు గాలి వెంకట రామిరెడ్డి తెలిపారు. నిధుల కేటాయింపులో అంతా డొల్లనే అని వ్యాఖ్యనించారు. రైతులను, అభివద్ధి చెందుతున్న రాష్ట్రాలను నిరుత్సాహపరిచే విధంగా బడ్జెట్ రూపొందించారన్నారు. కేంద్ర బడ్జెట్లో ఆంధ్రాకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలోని ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని మండిపడ్డారు. బడ్జెట్ కేటాయింపుల్లో విద్య, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు కోసం ఎంపీలు పోరాడాలన్నారు.

పేదలకు ఉపయోగపడని బడ్జెట్

సిఎస్ సాగర్ సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడదు. బడ్జెట్‌లో వ్యవసాయ పారిశ్రామిక రంగాలకు నామమాత్రంగా నిధులు విడుదల చేశారు. విద్య, వైద్య రంగాలకు పెద్దగా నిధులు లేవు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలపై స్పష్టత లేదు. రామాయపట్నం పోర్టు, దుగరాజపట్నం పోర్టు, కడప ఉక్కు పరిశ్రమ తో పాటు విశాఖ రైల్వే జోన్‌కు నిధులు విడుదల చేయకపోవడం దారుణం



ఇది అంకెల గారడీ బడ్జెట్

షేక్ సైదా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి

కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప మరొకటి కాదు. రైతులకు, వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. దేశంలో ఉన్న 81. కోట్ల మంది పేదలకు బడ్జెట్‌లో వారి ఊసే లేదు. నిరుద్యోగులకు, చిన్న తరహా పరిశ్రమలకు చేతివత్తుల వారి నీ నిరాశపరిచిన బడ్జెట్. ఇది అంకెల గారడి బడ్జెట్, కొత్త సీసాలో పాత సారాలా ఉంది. దేశంలో ఉన్న 81. కోట్ల మంది పేదల గురించి బడ్జెట్‌లో ఊసే లేదు.

